అభివృద్ధిలో మేటి..

పట్టుదల ఉంటే సాధించలేనిది లేదు. అత్యంత వెనుకబడిన 34వ వార్డు ఒకప్పుడు ఎటువంటి అభివృద్ధికి నోచుకోక సమస్యలకు ఆలవాలంగా ఉండేది. అయితే కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలిచిన తర్వాత 34వ వార్డు అభివృద్ధిలో పరుగులు తీస్తోంది. ప్రజల సహకారంతో గెలిచిన తాను పార్టీ పెద్దల ఆశీస్సులతో వార్డును అభివృద్ధి చేస్తానని కార్పొరేటర్ తోట పద్మావతి ధీమా వ్యక్తం చేస్తున్నారు.



వార్డు ప్రజలకు అందుబాటులోకి వచ్చిన డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- సకల సదుపాయాలతో దూసుకుపోతున్న 34వ వార్డు
- ప్రజలకు అందుబాటులో కల్యాణమండపం.. సీసీ రోడ్లు.. డ్రెయిన్లు.. అంగన్‌వాడీ భవనం.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- సుమారు రూ.5.40 కోట్లతో అభివృద్ధి పనులు
- వార్డు అభివృద్ధే లక్ష్యం అంటున్న కార్పొరేటర్ పద్మావతి

అల్లిపురం: గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అత్యంత వెనుకబడిన ప్రాంతం 34వ వార్డు. 2021 మార్చి 10వ తేదీన జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో తోట పద్మావతి కార్పొరేటర్‌గా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున విజయం సాధించారు. అప్పటి నుంచి ఆమె వార్డు ప్రజలకు మేలు చేయాలని సంకల్పంతో నిరంతరం పని చేస్తున్నారు. నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సహకారంతో వార్డులో అభివృద్ధి పనులు చేపట్టారు.

రూ.2.72 కోట్లతో అభివృద్ధి పనులు..

వార్డులో నేతాజీనగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణం, గంగుల గెడ్డ కల్వర్టు, కొబ్బరితోట కల్వర్టు, ఆర్ట్ పనులు, వార్డులో బ్లాక్ టాప్ రోడ్డు ప్యాచ్ వర్కులు, జెండాచెట్టు వీధిలో అంగన్‌వాడీ భవనం రినోవేషన్, ద్రోణంరాజు కాలనీలో మరమ్మతులు, అచ్చియ్యమ్మపేట సచివాలయంలో టాయిలెట్ల నిర్మాణం, పాఠశాల మరమ్మతులు, వరల్డ్ బ్యాంక్ నిధులతో పాఠశాల పునర్నిర్మాణం వంటి పనులు చేపట్టారు.

రూ.54 లక్షలతో సీటీ, పీటీ వర్క్స్..

వార్డులో 2021లో రూ.8 లక్షలతోను, 2022లో రూ.41 లక్షలతోను, 2023లో ఇప్పటి వరకు రూ.5 లక్షలతో మొత్తం రూ.54 లక్షలతో కమ్యూనిటీ టాయిలెట్లు, పబ్లిక్ టాయిలెట్ పనులు చేపట్టారు.

రూ.1.32 కోట్లతో వార్డు అభివృద్ధి పనులు..

వార్డు ప్రజలకు గతంలో వైద్య సౌకర్యం ఉండేది కాదు. వార్డు ప్రజలు భీమ్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గాని, ప్రసాద్ గార్డెన్స్‌లో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గాని వెళ్లేవారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి వార్డులో ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించటంతో 34వ వార్డుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 10 పడకలతో మంజూరు చేశారు. దీంతో రూ.1.17 కోట్లతో అచ్చియ్యమ్మపేటలో దీనిని నిర్మించారు. గత ఏడాది వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని చేతుల మీదుగా ఆధునిక హంగులతో ప్రారంభించారు. ప్రస్తుతం ఈ కేంద్రం ప్రజలకు సేవలందిస్తోంది. రూ.14.80 లక్షలతో మసీదు జంక్షన్ నుంచి కెప్టెన్ రామారావు జంక్షన్ వరకు బీటీ రోడ్డు నిర్మించారు. మరో రూ.14.05 లక్షలతో అచ్చియ్యమ్మపేట రోడ్డు, మనోరమా థియేటర్ ఎదుట బీటీ రోడ్లు నిర్మించారు. అచ్చియ్యమ్మపేటలో రూ.6.64లతో డ్రెయిన్లు నిర్మించారు. మరో రూ.30 లక్షలతో భూపేష్‌నగర్‌లో సీసీ డ్రెయిన్లు నిర్మించారు. వార్డు ప్రజలు తమ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు రూ.49.17 లక్షలతో కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. మరో రూ.16.15 లక్షలతో హాస్పిటల్, కల్యాణ మండపం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నారు.



కల్యాణమండపం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి (ఫైల్)

వార్డు అభివృద్ధే ధ్యేయం



వార్డు ప్రజల సహకారంతో కార్పొరేటర్‌గా గెలిచిన నేను పార్టీ పెద్దల ఆశీస్సులతో వార్డు అభివృద్ధికి కట్టుబడి ఉన్నాను. మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సహకారంతో వార్డును అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాను. వార్డులో ఇప్పటి వరకు సుమారు రూ.5 కోట్ల 40 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టాం.

–తోట పద్మావతి, 34వ వార్డు కార్పొరేటర్

సంతృప్తికరంగా అభివృద్ధి



వార్డులో కార్పొరేటర్ తోట పద్మావతి సంతృప్తికరంగా పనులు నిర్వహిస్తున్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నారు. సమస్య చెప్పిన వెంటనే పరిష్కరించేందుకు ముందుంటున్నారు. పద్మావతి అమ్మ అని పిలిస్తే పలుకుతారు. వార్డు ప్రజల అవసరాలను అడగకుండానే తెలుసుకుని పరిష్కరిస్తున్నారు.

–గంకిన మంగ, 34వ వార్డు

'జగనన్న సురక్ష'తో మరింత చేరువగా సేవలు

- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయంలో జగనన్న సురక్షపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల విషయంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో తాజాగా మరో కొత్త కార్యక్రమం జగనన్న సురక్ష పేరిట ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి జూలై ఒకటి నుంచి ప్రారంభించాలన్నారు. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేయడమే ఈ శిబిరాల లక్ష్యంగా పెట్టుకోవాలని, తరచూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా, స్పాట్‌లోనే సర్టిఫికెట్లు ఇచ్చే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నెల రోజుల పాటు నిర్వహించనున్నట్టు చెప్పారు. సచివాలయ స్థాయిలోనే సమస్యలు పరిష్కరించి, ప్రతి పౌరుడి ముఖంలో చిరునవ్వు చూడడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న సురక్ష గురించి అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలోని 1.6 కోట్ల కుటుంబాల వద్దకే అధికారులు వెళ్లనున్నారని తెలిపారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో 74 సచివాలయాల్లో ముందుగా గుర్తింపబడిన పత్రాలకు సంబంధించిన సమ్యలను పరిష్కరించడానికి అధికారులు ప్రతి సచివాలయంలో ఒక రోజు క్యాంపు నిర్వహిస్తారని చెప్పారు. శత శాతం అర్హులను ప్రభుత్వ పథకాల్లో చేర్చడం, పత్రాల సమస్యలకు సత్వర పరిష్కారం చూపడమే కార్యక్రమ టార్గెట్‌గా పేర్కొన్నారు.

జారీ చేసే సర్టిఫికెట్లు ఇవే..

జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు (కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు), ఆదాయ ధ్రువీకరణ, డేట్ ఆఫ్ బర్త్, మరణ ధ్రువీకరణ, మ్యూటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్, మ్యూటేషన్ ఫర్ కరక్షన్స్, వివాహ ధ్రువీకరణ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఆధార్ కార్డులో మొబైల్ నంబరు అప్‌డేట్, కౌలు గుర్తింపు కార్డులు, కొత్త రేషన్ కార్డు, రేషన్‌కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో కొంత మంది సభ్యుల పేర్ల తొలగింపు.. వంటి సేవలు అందించనున్నారని చెప్పారు. కార్యక్రమంలో పలు వార్డుల కార్పొరేటర్లు, అధ్యక్షులు, జేసీస్ క్లస్టర్ ఇన్‌చార్జిలు, అనుబంధ సంఘాల నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ విక్రేతలపై దాడులు



ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్న జీవీఎంసీ ప్రత్యేక అధికారి అప్పలరాజు, సిబ్బంది

జగదాంబ: ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం అని జీవీఎంసీ జోన్-4 ప్రత్యేక అధికారి అప్పలరాజు అన్నారు. శనివారం పూర్ణామార్కెట్ హోల్‌సేల్ ప్లాస్టిక్ దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. అయినప్పటికీ హోల్‌సేల్ దుకాణాల్లో వ్యాపారులు యథేచ్ఛగా నిషేధిత ప్లాస్టిక్ అమ్మకాలు చేస్తున్నారన్నారు. ఇందుకోసమే మళ్లీ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్లాస్టిక్‌పై దాడులు నిర్వహించేందుకు కమిషనర్ సాయికాంత్ వర్మ చర్యలు తీసుకున్నారని తెలిపారు. కవర్లు విక్రయిస్తే ఆయా దుకాణాలపై అపరాధ రుసుం విధించడంతో పాటు ట్రేడ్ లైసెన్సులు రద్దు చేస్తామని ఏఎంహెచ్‌వో హెచ్చరించారు. భూమిలో కలిసి పోయే 125 మైక్రాన్ కవర్లు మాత్రమే అమ్మకాలు చేయాలన్నారు. అలాగే ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు విధి విధానాల ప్రకారం పీచు ఎక్కువగా ఉన్న సంచులు (నాన్ ఓవెన్ కవర్లు) కూడా నిషేధించబడ్డాయన్నారు. అనంతరం ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుని అపరాధ రుసుం విధించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు దూమ్ర వారాహి అవతారంలో అమ్మవారి దర్శనం



దూమ్ర వారాహి అవతారంలో వారాహి దేవి

అల్లిపురం : బంగారుమెట్ట షిర్డీసాయి దర్బార్‌లో వెలసిన అనఘాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో వారాహి నవరాత్రుల సందర్భంగా అమ్మవారు ప్రతి రోజు ఒక ప్రత్యేక అవతారం, అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారు శనివారం దూమ్ర వారాహి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని గోరింటాకుతో అలంకరించి పూజించారు. సింధూర వర్ణంలో మెరిసిపోతున్నట్లు అమ్మవారి అలంకరణను తీర్చిదిద్దారు.

నేడు మహా వారాహి అవతారం..

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ఆదివారం మహా వారాహి అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

మానవ హక్కుల న్యాయస్థానాలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్యాంప్రసాద్

డాబాగార్డెన్స్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానవ హక్కుల న్యాయస్థానాలు ఏర్పాటు చేసేందుకు చొరవ చూపాలని మానవ హక్కుల సమితి రాష్ట్ర కన్వీనర్ మంత్రి శ్యాంప్రసాద్ కోరారు. సమితి కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. ప్రస్తుతం ఉన్న చట్టంలో సవరణలు చేసి, మానవ హక్కులు మరిన్ని కల్పించాలని శ్యాంప్రసాద్ డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. సమావేశంలో సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

సేవా రంగంలో యువత పాత్ర కీలకం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎస్‌ఏడీ పాల్

డాబాగార్డెన్స్: సామాజిక సేవా కార్యక్రమాల్లో యువతే కీలకపాత్ర పోషించాలని, సామాజిక కార్యక్రమాలపై యువతకు అవగాహన ఉండాలని అకడమిక్ స్టాఫ్ కాలేజ్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్‌ఏడీ పాల్ పేర్కొన్నారు. నగరంలోని ఏవీఎన్ కళాశాలలో కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టుపై శనివారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని, ప్రజల స్థితిగతులపై సర్వే నిర్వహించి సమస్యలు గుర్తించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి విద్యార్థులకు ఇదో మహత్తర అవకాశంగా భావించాలన్నారు. అకడమిక్ డీన్ శంకర నారాయణరావు, పైడి రజని, డబ్బీరు గాయత్రి, జీవీఎస్‌వీఎల్ శ్రీనివాసకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు భద్రత కల్పించాలి

డాబాగార్డెన్స్: కాంట్రాక్టర్లు కార్మికులకు భద్రత కల్పించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. యూనియన్ ఉపాధ్యక్షుడు శీర రమణ మాట్లాడుతూ సూర్రెడ్డి అనే కార్మికుడు ఎలక్ట్రికల్ పని చేస్తూ పోల్ ఎక్కినప్పుడు అనుమానాస్పదంగా మృతి చెందాడని, గట్టిగా అడిగితే కార్మికుడు పోల్ ఎక్కి పడిపోయాడని కాంట్రాక్టర్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అసలు కాంట్రాక్టర్ అనే వాడు భద్రత కల్పించాల్సిన బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. కాంట్రాక్ట్ కార్మికుడు చనిపోతే ఇటు జీవీఎంసీ గానీ, అటు కాంట్రాక్టర్ గానీ స్పందించకపోవడం శోచనీయమన్నారు. చనిపోయిన సూర్రెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయం చేయకపోతే శవపంచనామా జరిగిన తర్వాత మృతదేహాన్ని జీవీఎంసీ వద్దకు తీసుకొచ్చి నిరసన చేపడతామని హెచ్చరించారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి

జగదాంబ: కాన్వెంట్ జంక్షన్ ఫ్లై ఓవర్‌పై గుర్తు తెలియన వ్యక్తి మృతి చెందిన ఘటనపై హార్బర్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్ఎస్‌వీఎస్ఎన్ రాజు అనే వ్యక్తి విశాఖపట్నం పోర్టు ట్రస్ట్‌లోని శ్రీనివాస కాటా నుంచి విధులు ముగించుకుని శుక్రవారం రాత్రి వస్తున్నారు. ఆయన గాజువాక వైపు వెళ్తుండగా కాన్వెంట్ జంక్షన్ ఫ్లై ఓవర్ ఎంట్రన్స్ వద్ద సుమారు 45 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. మృతుడి కాలు, తల నుజ్జునుజ్జు అయి ఉందని, అతన్ని ఏదో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయి ఉంటుందని తమకు ఫిర్యాదు చేసినట్లు హార్బర్ పోలీసులు తెలిపారు. మృతుడు 5.5 అడుగుల పొడవు ఉన్నాడని, చేతి వేలికి ఉంగరం, నల్లని నిక్కరు, తెల్లని వైట్ టీ షర్టు వేసుకున్నట్లు హార్బర్ పోలీసులు తెలిపారు. ఈ విషయమై 9154879915, 8331041665 నంబర్లలో హార్బర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు పేర్కొన్నారు.

టైలరింగ్‌లో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ల ప్రదానం



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కార్పొరేటర్ సాధిక్

జగదాంబ: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని 35వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ అన్నారు. శనివారం డాన్‌బాస్కో టైలరింగ్ సంస్థలో ఉచితంగా శిక్షణ పొందిన రెండవ బృందానికి సర్టిఫికెట్లు అందించారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని అన్నారు. ఇప్పటికే మొదటి బృందం శిక్షణ పొంది ఉపాధి సంపాదించుకున్నట్లు తెలిపారు. ఔత్సాహికులకు నగరంలో ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రయత్నిస్తున్నట్లు సాధిక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అనధికార దుకాణాల తొలగింపునకు వినతి



జోన్-4 కమిషనర్ శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టర్

జగదాంబ: సర్దార్ వల్లభాయ్‌పటేల్ పూర్ణామార్కెట్ పార్కింగ్ స్థలంలో అనధికారికంగా పెడుతున్న దుకాణాలను తొలగించాలని కోరుతూ శనివారం జోన్-4 కమిషనర్ శివప్రసాద్‌కు కాంట్రాక్టర్ వినతిపత్రం అందజేశారు. మార్కెట్ వద్ద పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన స్థలంలో నిత్యం దుకాణాలు పెడుతున్నారన్నారు. దీని వలన ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని అన్నారు. తగాదాలు కూడా జరుగుతున్నాయని తెలిపారు. ఈ విషయంపై జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మకు కూడా ఫిర్యాదు చేశామన్నారు. కాంట్రాక్టర్ ఫిర్యాదుపై స్పందించిన జెడ్సీ శివప్రసాద్ వెంటనే దుకాణాల తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

అనాథ మహిళకు ఆశ్రయం



నిరాశ్రయ వసతి గృహం మేనేజనర్‌కు మంగను అప్పగిస్తున్న రాము

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు కంఠంవారి వీధిలో చాలా కాలంగా తిరుగుతున్న అనాథ మహిళ మాదాబత్తుల మంగను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాము టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయికి అప్పగించారు. అనాథ మహిళకు కల్పించిన ఆయనకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

33వ వార్డులో 'జగనన్న సురక్ష' ప్రారంభం



సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వేలో పాల్గొన్న ఏడీసీ వర్మ, జెడ్సీ శివప్రసాద్

అల్లిపురం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష పథకాన్ని ప్రారంభించినట్లు జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ సచివాలయ సిబ్బందికి తెలిపారు. దీంట్లో భాగంగా ఆయన 33వ వార్డు బంగారుమెట్ట సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందికి పథకం అమలు తీరుపట్ల అవగాహన కల్పించారు. అర్హులై ఉండీ ఏ పథకం అందని వారికి కూడా సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంతో పని చేయాలన్నారు. లబ్ధిదారులకు అవసరమైన జనన, మరణ, కుల, సీసీఆర్సీ, రేషన్‌కార్డు డివిజన్, హౌస్ హోల్డ్ డివిజన్, ఆదాయ ధ్రువీకరణ తదితర 11 రకాల పత్రాలు అవసరమైతే సర్వీసు ఫీజు లేకుండా ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా లంచాలు, వివక్షకు తావు లేకుండా నూటికి నూరు శాతం సంతృప్తికర స్థాయిలో పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందించాలన్నదే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

29న బల్లిగిరి వెంకన్నకు ప్రత్యేక పూజలు

అల్లిపురం: ఆషాఢ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఈ నెల 29వ తేదీన బల్లిగిరి వేంకటేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆ రోజు తెల్లవారు జాము నుంచే స్వామి వారికి విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయ్ తెలిపారు. ఇదిలా ఉండగా బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు శనివారం భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో సహస్ర నామాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బల్లిగిరి వెంకన్నను తులసి మాలలతో విశేషంగా అలంకరించారు.

ఎట్టకేలకు స్టాపర్ల ఏర్పాటు



కేజీహెచ్ వద్ద ఏర్పాటు చేసిన స్టాపర్లు

మహారాణిపేట : కేజీహెచ్ రోడ్డులో ఎట్టకేలకు స్టాపర్లు ఏర్పాటు చేశారు. కొద్ది రోజుల పాటు స్టాపర్లను తొలగించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిన సంగతి తెలిసిందే. గతంలో కేజీహెచ్ అవుట్ గేటు నుంచి ఓపీ గేటు వరకు స్టాపర్లు ఏర్పాటు చేశారు. దీనివల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉండేది కాదు. కాని కొద్ది రోజుల క్రితం ఈ స్టాపర్లు తొలగించారు. ఎందుకు తొలగించారో ఎవరికీ తెలియదు. తిరిగి స్టాపర్లు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ నియంత్రణ అదుపులోకి వచ్చినట్లు అయింది.

యూపీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు

- జిల్లా ప్రత్యేక అధికారి కోటేశ్వరరావు



పదోవార్డు యూపీహెచ్‌సీని పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ, అధికారులు

ఆరిలోవ: నగరంలోని యూపీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని సీడీఎంఏ, జిల్లా ప్రత్యేక అధికారి పి.కోటేశ్వరరావు ఆదేశించారు. పదో వార్డు వివేకానందనగర్‌లో యూపీహెచ్‌సీని శనివారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావుతో కలసి ఆయన సందర్శించారు. ఇక్కడ యూపీహెచ్‌సీని పరిశీలించారు. ఏ ఏ వైద్య సేవలు అందుతున్నాయి? ఎంతమంది వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు? ఇక్కడ మందులు, పరికరాలు, సిబ్బంది, మౌలిక సదుపాయాలు తదితర వాటి గురించి డీఎంహెచ్‌వోని అడిగి తెలుసుకొన్నారు. ఇక్కడకు వచ్చిన రోగులతో ఆయన మాట్లాడి అందుతున్న వైద్య సేవలుపై ఆరా తీశారు. రోజూ ఓపీ ఎంత నమోదవుతోందో అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చిన రోగులు ఇబ్బందిపడకుండా మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. రోగుల తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్శనలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు శ్రీనివారావు, డాక్టర్ సన్యాసిరావు, జోన్-2 జెడ్సీ కనకమహలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్ పాల్గొన్నారు.

బొండా కుటుంబ సభ్యులకు పరామర్శ



బొండా కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెబుతున్న పంచకర్ల రమేష్ బాబు

మహారాణిపేట: ప్రమాదవశాత్తు మృతి చెంది అవయవదానం చేసిన బొండా వెంకట సంతోష్ కుమార్ (వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు బొండా ఉమామహేశ్వరరావు సోదరుడు) కుటుంబ సభ్యులను పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు శనివారం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయనతోపాటు రీజినల్ ఎస్సీ సెల్ కో ఆర్డినేటర్ అల్లంపల్లి రాజబాబు, రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కొరికాణ మోహన్‌రావు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ పేర్ల విజయచందర్, సీనియర్ నాయకులు వానపల్లి ఈశ్వరరావు, చొక్కర శేఖర్, జి.విక్టర్, వెంకట్, ధూళి రఘు, నల్లా రవి, పతివాడ కనకరాజు ఉన్నారు.

పీఆర్‌ఎస్‌ఐ జాతీయ కార్యదర్శిగా పీఎల్‌కే మూర్తి

కొమ్మాది: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల ప్రజా సంబంధాల అధికారులు సభ్యులుగా గల భారత ప్రజా సంబంధాల సంఘం (పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా) జాతీయ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ పీఎల్‌కే మూర్తి ఎన్నికయ్యారు. ఈ మేరకు న్యూ ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్‌లో శనివారం జరిగిన ఎన్నికల్లో ఆయనను ఎన్నికల అధికారి సుభాష్ సూద్ ప్రకటించారు. జాతీయ అధ్యక్షుడిగా డాక్టర్ అజిత్ పాఠక్ ఎన్నికయ్యారు. దక్షిణ భారత విభాగానికి విశాఖకు చెందిన హెచ్‌పీసీఎల్ విశ్రాంత అధికారి యూఎస్ శర్మ ఎన్నికయ్యారు. జాతీయ కార్యదర్శిగా ఎంపికైన డాక్టర్ పీఎల్‌కే మూర్తి విశాఖ పి.ఐ.ఎస్.ఐ చైర్మన్‌గా, కార్యదర్శిగా సేవలు అందించారు.





నగరంలోని టర్నర్ చౌల్ట్రీలో శనివారం జగన్నాథ స్వామి నృసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు. చిత్రంలో స్వామి దర్శనానికి బారులుతీరిన భక్తులు - డాబాగార్డెన్స్